క్లుప్తంగా

గిరిజన చట్టాలు పక్కాగా అమలుచేయాలి

గంగవరం: ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయటంలో అధికారులు చిత్తశుద్ధి చూపాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల కమిటీ అధ్యక్షుడు కంగాల అబ్బాయి దొర అన్నారు. రాజవరం గ్రామంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల కమిటీ సమావేశంలో అబ్బాయిదొర మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి చట్టాల అమలు కోసం ఆదివాసి సంక్షేమ పరిషత్ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి ఏడుకొండలరావు దొర, నాగేశ్వరావు, దొర, రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి పనికి జియో ట్యాగింగ్



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో కుమార్

అడ్డతీగల: లేబర్ బడ్జెట్‌కి అనుకూలంగా వంద రోజుల పనిని అందరికీ కల్పించాలని అడ్డతీగల ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ అన్నారు. ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఉపాధి శ్రామికునికి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఉపాధి పనులకు తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. పండ్ల తోటలను రైతులు సక్రమంగా సంరక్షించుకోవాలన్నారు. క్లోజర్ ఆఫ్ వర్క్‌లపై ఇంజినీర్ నుంచి ఆరా తీశామన్నారు. ప్రతి పారామీటర్ దగ్గరగా పర్యవేక్షించాలని ఏపీవోను ఆదేశించామన్నారు. ఏపీవో చిరంజీవిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చేగువేరాకు ఘన నివాళి



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పాడేరు రూరల్: విప్లవకారుడు చేగువేరా వర్ధంతిని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చేగువేరా పేదలకు అండగా నిలిచి వారి కోసం ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. విద్యార్థి సంఘం నాయకులు నాని, సతీష్, చందు, ధన పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



లోతుగెడ్డ జంక్షన్ సమీపంలో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

చింతపల్లి: మండలంలో పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా అతి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురైన సంఘటన లోతుగెడ్డ జంక్షన్ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. పాడేరు నుంచి చింతపల్లి వస్తున్న (ఏపీ31జెడ్ 0201) నంబర్ గల ఆర్టీసి బస్సు లోతుగెడ్డ జంక్షన్ సమీపంలో ఎదురుగా బైక్‌పై అతివేగంగా వస్తున్న వ్యక్తి ఢీకొనబోయాడు. డ్రైవర్ చాకచక్యంగా బస్సును పక్కన ఉన్న రాళ్ల వైపు మళ్లించడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికీ బస్సులో సుమారు 25 మంది ప్రయాణికులున్నారు. దీంతో ప్రయాణికులు పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

మహిళా చట్టాలు పటిష్టంగా అమలుచేయాలి



చింతూరులో జరిగిన ఐద్వా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి

చింతూరు: దేశంలో రోజు రోజుకు మహిళలకు రక్షణ కరవైందని, ప్రభుత్వాలు మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఐద్వా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి అన్నారు. మండలంలోని ఎర్రంపేటలో గురువారం ఐద్వా రెండో మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో హింసా కార్యక్రమాలు, వరకట్న వేధింపులు అధికమయ్యాయని, మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆమె విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, పోలవరం నిర్వాసితులకు త్వరితగతిన పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో భాగమంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా మడివి శ్రీదేవి, కార్యదర్శిగా పద్మావతిలు ఎన్నికయ్యారు. కిరణ్, వెంకట్, లక్ష్మి, లక్ష్మణ్, రాములమ్మ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- కోతకు గురవుతున్న వట్టిగెడ్డ రిజర్వాయర్ పొర్లగట్టు
- వృథాగా పోతున్న నీరు
- నీటి ట్యాంకు మార్గంలో పెరిగిన తుప్పలు
- పట్టించుకోని అధికారులు



రిజర్వాయర్ పొర్లగట్టుకు పడిన రంధ్రాల ద్వారా వృథాగా పోతున్న నీరు



వట్టిగెడ్డ రిజర్వాయర్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట అటవీ ప్రాంతంలో గల వట్టిగెడ్డ రిజర్వాయర్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. 50 ఏళ్ల క్రిందట నిర్మించిన ఈ రిజర్వాయర్ పొర్లు గట్టుకు పెద్ద పెద్ద రంధ్రాలు పడి చెరువు గర్భంలోని నీరు వృథాగా పోతోంది. ఈ పొర్లగట్టు కోతకు గురై ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మించినప్పటి నుంచి పర్యవేక్షణ మెయింటినెన్స్ లేకపోవడంతో పూర్తిగా శిథిల స్థితికి చేరిందని చెబుతున్నారు. అయిదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రిజర్వాయర్ నేటి వరకు ఎటువంటి మరమ్మతు పనులు చేయలేదని స్థానిక రైతులు చెబుతున్నారు.

గ్రామంలోని రెండు కొండల నడుమ దాదాపు కిలోమీటరు పొడవునాఅతి బలమైన, ఎత్తైన బండ్ (గట్టు) నిర్మించారు. దీంతో 200 ఎకరాల చెరువు గర్భం ఏర్పడి, ఈ రిజర్వాయర్ నిత్యం జలాలతో కళకళలాడుతు ఉంటుందంటున్నారు. ఈ రిజర్వాయర్ దిగువన 5 కిలోమీటర్ల పొడవైన పంట కాలువ ద్వారా ఆరు గ్రామాలకు చెందిన దాదాపు 3వేల ఎకరాలకు ఏడాది పొడవునా సాగు నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో పాటు పలు గ్రామాలకు సాగు, తాగునీరు అందుతుందని చెబుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మరో వైపు చుట్టు కొండలు, పచ్చని అడవులతో ఈ రిజర్వాయర్ పరిసరాలు ఎంతో ఆకర్షణగా పర్యాటక ప్రాంతంగా పేరొందింది. పిక్నిక్ సీజన్‌లలో ఈ రిజర్వాయర్‌ను చూసేందుకు, ఫోటోలు తీసుకొనేందుకు ఎక్కడెక్కడ పర్యాటకులు వస్తుంటారు. ఇంతటి విశేషత గల ఈ రిజర్వాయర్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ పొర్లు గట్టుకు కోతకు గురవుతుండడంతో మరింత విస్తరించే ప్రమాదం ఉందంటున్నారు. గట్టుకు రంధ్రాలు పడడంతో బలహీనపడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రిజర్వాయర్ షట్టర్లు (తూము గేట్లు) పూర్తిగా తుప్పు పట్టి రిజర్వాయర్‌లోని నీరు ఎప్పటికప్పుడు వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు బండ్‌పై తుప్పలు పెరడడంతో ట్యాంకు బండ్ బీటలు వారి బలహీనపడిందని, జంగిల్ క్లియరెన్స్ చేపట్టి రిజర్వాయర్‌కు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ రిజర్వాయర్ సర్‌ప్లస్ వియర్ ఒకటి నుంచి నాలుగు డ్రాపులు గతంలో ఏర్పడిన వరదలకు కొట్టుకొని పోగా నేల పెద్దఎత్తున కోతకు గురైందని, కాంక్రీట్‌తో ఈ డ్రాపులను పునర్నిర్మించాలని రైతులు కోరుతున్నారు. రిజర్వాయర్ చెరువు గర్భం పూడికతో నిండి ఉందని, దీంతో రిజర్వాయర్ నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం కూడా కోల్పోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మైనర్ ఇరిగేషన్ జేఈ హరిన వివరణ కోరగా రూ. 50 లక్షలతో రిజర్వాయర్ మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు



వట్టిగెడ్డ ట్యాంకుబండ్‌పై పెరిగిన తుప్పలు

అధికారుల దృష్టికి సమస్య

వట్టిగెడ్డ రిజర్వాయర్ పరిస్థితిని ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లాం. అప్పట్లో ప్రతిపాదనలు పంపారు.అయితే పీవో బదిలీ కావడంతో కొత్త పీవో బాధ్యతలు చేపట్టారు. ఆయకట్టు రైతులతో మరోసారి పీవోను కలిసి సమస్యను వివరిస్తాం. రిజర్వాయర్ మరమ్మతు కోసం విన్నవిస్తాం.

– ఎస్.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు, దూసరపాము

యూరియా పంపిణీ

కూనవరం: మండలంలోని వెంకటాయపాలెంలో రైతులకు యూరియాను గురువారం వ్యవసాయాధికారి సీహెచ్.దేవి పంపిణీ చేశారు.కూటూరుగట్టు సొసైటీ ద్వారా 220 టన్నుల యూరియా పంపిణీ చేసినట్టు ఆమె చెప్పారు. సర్పంచ్ సోందె ముత్తమ్మ, ఎంపీటీసీ మడకం నాగరాణి, అగ్రికల్చర్ అసిస్టెంట్, సచివాలయం కానిస్టేబుల్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కరదీపిక ఆవిష్కరణ



కరదీపిక ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు

పాడేరు రూరల్: నూతన 2025 డీఎస్సీ ఉపాధ్యాయుల కరదీపికను ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు, అనంతరం ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ నూతనంగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు సంబంధించిన అంశాలు ఈ ప్రత్యేక కరదీపికలో పొందుపరిచమన్నారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు అరకులోయ, అడ్డతీగలలో శిక్షణ పొందుతున్నారన్నారు. వారి అవసరమైన మెటీరియల్, కరదీపికలను ఉపాధ్యాయ ఫెడరేషన్ ద్వారా ఉచితంగా అందిస్తున్నమన్నారు. ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్యాంసుందర్,పోతురాజు, సాంబాబు, సత్యారావు, భైరవమూర్తినాయుడు, బాబూరావు పాల్గొన్నారు.

ఎంఈవోలకు వినతులు



డుంబ్రిగుడులో ఎంఈవో శెట్టి సుందరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు



ఎటపాకలో ఎంఈవో రాజులుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

డుంబ్రిగుడ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమైక్య పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనేతర పనులు, విద్యా శక్తి కార్యక్రమాలకు బహిష్కిరిస్తామని ఎంఈవో శెట్టి సుందర్‌రావుకు గురువారం మెమోరండంను ఫ్యాప్టో జిల్లా నాయకులు ఎస్.కన్నయ్య, రఘునాథ్ శెట్టి, బాలకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం, పరీక్ష పత్రాల మూల్యాంకనం తప్ప వేరే బోధనేతర పనులు చేయమని, బహిష్కరిస్తామన్ని ప్రభుత్వానికి తెలియజేశారు. సభ్యులు బాలకృష్ణ, రాజారావు, శ్రీరామ్, బొబ్బిలి, జలంధర్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎటపాక: పాఠశాలల్లో బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్టు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నాయకులు తెలిపారు. గురువారం ఎటపాకలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాఠాలు బోధించే సమయం కంటే బోధనేతర పనులే అధికమయ్యాయని, ఈ కారణంగా బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఇందులోభాగంగా ప్రతి మండలంలో ఎంఈవోలకు వినతిపత్రాలు అందించామని, తమకు రావాల్సిన నాలుగు డీఏలతో పాటు పీఆర్‌సీ కమిటీని నియమించి 30 శాతం ఫిట్‌మెంట్ వెంటనే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. సభ్యులు శ్రీనివాస్, ప్రభాకర్, గంగరాజు, జహీదా బేగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలు మెరుగుపరచాలి



శిక్షణలో మాట్లాడుతున్న కల్పన, పక్కన ఎంఈవోలు తదితరులు

కొయ్యూరు: విద్యా సామర్థ్యాలను మెరుగుపరచాలని సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన శైల అన్నారు. జిల్లాలో పిల్లలు రాయడం, చదవడంలో బాగా వెనకబడి ఉన్నారని ఉపాధ్యాయులకు చెప్పారు. రెండో విడత ట్రాల్ శిక్షణ శిబిరాన్ని ఉపాధ్యాయులకు కొయ్యూరు ప్రభుత్వోన్నత పాఠశాలలో ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాణాల సామర్థ్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో గిరిజన విద్యార్థులు భవిష్యత్‌లో రాణిస్తారన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ సూచనలతో ఈ జిల్లాలో అభ్యాసనను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. దీనికి అవసరమైన నిధులను విడుదల చేశామన్నారు. ఉపాధ్యాయులు దీనిపై పూర్తిగా దృష్టి సారించాలని సూచించారు. ఏఎంవో భాస్కరరావు, ఎంఈవో ఎల్.రాంబాబు, ఎంఈవో-2 ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి

గంగవరం : మండల పరిషత్ సమావేశాలకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు హాజరుకాకపోవడం పట్ల మండల పరిషత్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడం పట్ల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమావేశాలకు హాజరుకాని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణరావును సూచించారు. ఇందుకు సమాధానంగా ఎంపీడీవో లక్ష్మణరావు మాట్లాడుతూ అందుబాటులో ఉండి సమావేశానికి హాజరుకాని అధికారులు, ఉద్యోగులకు నోటీసులు జారీ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రభాకర్, కొత్తాడ సర్పంచ్ కామరాజు దొర మాట్లాడుతూ గత సమావేశాల దృష్టికి వచ్చిన సమస్యలు, చేసిన తీర్మానాలు ఎంత వరకు పరిష్కారించారో వివరించాలని పట్టు పట్టారు. సమావేశంలో చేసిన తీర్మానాలను జిల్లా పరిషత్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీడీవో వివరణ ఇచ్చారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. మండలం అభివృద్ధికి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైస్ ఎంపీపీలు కె.రామతులసి, కె.గంగాదేవి, మొల్లేరు సొసైటీ చైర్‌పర్సన్ పాము అర్జున, ఎంపీటీసీ సభ్యులు కనకలక్ష్మి, పద్మావతి, ఆదినారాయణ, వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కలుముల అక్కమ్మ, కురసం అక్కమ్మ, కామరాజు, కె.లక్ష్మి, రామలక్ష్మి, రమణమ్మ, పార్వతి, రాజమ్మ, లీలావతి, మల్లికార్జునదొర, వెంకటేశ్వర్లు, తమ్మన్నదొర, ఎంపీడీవో వై.లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపీడీవో నరసింగరావు, ఏపీవో ప్రకాశ్, వ్యవసాయాధికారి లక్ష్మణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, ఏఈ నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



సీమంతంలో పాల్గొన్న సీడీపీవో దేవమణి తదితరులు



గర్భిణిలకు సీమంతాలు చేస్తున్న సీడీపీవో అంగన్వాడీ కార్యకర్తలు

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం గిరిజన్ భవన్‌లో గురువారం ప్రాజక్ట్ స్థాయి పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో దేవమణి, సర్పంచ్ పి.సింహాచలం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని కోరారు.పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. సూపర్‌వైజర్లు, బీపీవో సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో శారదదేవి తెలిపారు, పాడేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్ పరిధిలో గల ఎం.కె.వీధి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎన్ఎం మత్స్యకొండమ్మ, మహిళ పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు చిన్నారి, అంబిక, చాయదేవి, భాగ్యలక్ష్మి, విజయ, రవణమ్మ, వసంతకుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



తాటివాడలో అవగాహన కల్పిస్తున్న డీపీవో చంద్రశేఖర్

రంపచోడవరం: గ్రామాల్లో ప్రజలకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తాటివాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి పర్యవేక్షించారు. డీపీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ పంచాయతీ ఆస్తుల సంరక్షణ, మంచినీటి సరఫరా పారిశుధ్యం వంటి అంశాలపై బందపల్లి, తాటివాడ సర్పంచ్‌లతో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఇంటి పన్ను వసూలు నూరుశాతంపై చర్చించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన



మాట్లాడుతున్న ఎంపీడీవో ధర్మారావు

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.ధర్మారావు అన్నారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి గ్రామంలో ఆదికర్మ యోగి అభియాన్ గ్రామ సభను గురువారం నిర్వహించారు.గ్రామంలో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ధర్మారావు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి ప్రణాళికను రూపొందించనున్నట్టు చెప్పారు. తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం, నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సర్పంచ్ సుభాష్‌చంద్ర, అధికారులు సత్యనారాయణ, సూర్యనారాయణమూర్తి, పంచాయితీ కార్యదర్శి సింహాచలం, వివిధ శాఖాల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



రంపచోడవరంలోని రామాలయాన్ని సందర్శించిన డీఈఈ సైదా తదితరులు

రంపచోడవరం: ఏజెన్సీలో శ్రీ వాణి ట్రస్ట్ ద్వారా చేపడుతున్న దేవాలయాల నిర్మాణ పనులను ఎండోమెంట్ డిప్యూటీ ఈఈ ఎస్.కె.సైదా గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆయనను కలిశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో ఆదివాసీ గ్రామాల్లో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంలో గ్రామస్తులు సహాయ సహకారులు అందించడం అభినందనీయమన్నారు. వీహెచ్‌పీ జిల్లా సత్సంగ్ ప్రముఖ్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి,కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం



కంతారం ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు, సిబ్బంది



అడ్డతీగల సీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ నారే వాసు



చింతూరు ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి

కొయ్యూరు/చింతపల్లి: జీఎస్టీపై అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. జీఎస్టీ తగ్గినా పాత ధరలకే విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీఎస్టీపై విధిగా అవగాహన పెంచుకోవాలని కోరారు. కొయ్యూరు మండలంలోని కొమ్మిక, కంతారం గ్రామాల్లో జీఎస్టీ అధికారి గాదం భాస్కరరావు, ఎంపీడీవో బాల మురళీకృష్ణ తదితరులు పర్యటించారు. చింతపల్లిలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచ్ శాంతికుమారి, ఎంపీటీసీ నాగమణి పాల్గొన్నారు.

అడ్డతీగల: జీఎస్టీ సంస్కరణలతో అందుబాటులో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్ అన్నారు.స్థానిక సిహెచ్‌సిలో గురువారం జీఎస్టీ సంస్కరణలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తగ్గిన జీఎస్టీ వల్ల ప్రజలకు నేరుగా లాభం చేకూరుతుందని ఆస్పత్రి కౌన్సిలర్ నారే వాసు అన్నారు. వైద్యాధికారి ప్రసన్నదేవి మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాల చికిత్సకు ఉపయోగించే మందులపై జీఎస్టీ 5 శాతానికి తగ్గిందన్నారు.36 రకాల ప్రాణ రక్షక మందులపై జీఎస్టీ పూర్తిగా రద్దు అయినందని చెప్పారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: ఆరోగ్యంలో ప్రధాన భాగమైన మందులపై జీఎస్టీ తగ్గింపు గురించి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో గ్రామీణ ప్రాంత రోగులకు మందులు, వైద్య పరికరాలపై ఖర్చు తగ్గుతుందన్నారు. వైద్యులు రమణారావు, మహేష్ పాల్గొన్నారు.



లంబసింగిలో ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి, సర్పంచ్ శాంతి, అధికారులు

హైడ్రోపవర్ ప్రాజెక్టు రద్దు చేయాలి



గ్రామసభలో తీర్మానం చేస్తున్న స్థానికులు

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ కేంద్రంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. కితలంగి సర్పంచ్ వరబోని సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన సభలో పలు సమస్యలను స్థానికులు తెలియజేశారు. ఇందులో భాగంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. ఏజెన్సీకి, గిరిజనులకు విఘాతం కలిగించే ఈ ప్రాజెక్టు ఏర్పాటు యోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు గిరిజనులకు ఇబ్బంది కలిగించే పలు చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు మహేష్, సీతారామ్, మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.